సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం । 22 । అక్టోబర్ । 2024



గుప్త నిధుల కోసం తవ్వకాలు

అంజనేయస్వామి మండపాన్ని జేసీబీతో కూల్చి మండపం కింద గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన సంఘటన ఆదివారం రాత్రి మండల కేంద్రమైన గుర్రంకొండకు సమీపంలో జరిగింది. - 8లో



పరువు కోసమే యువకుడి హత్య

అన్నమయ్య జిల్లాలో సంచలనం సృష్టించిన కురబలకోట యువకుడు ఖాదర్‌బాషా హత్య పరువు కోసమే జరిగిందని డీఎస్పీ కొండయ్య నాయుడు తెలిపారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.430	రూ.520
రెండోరకం	రూ.320	రూ.420

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 187 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

24న పెన్షన్, జీపీఎఫ్ అదాలత్

కడప సెవెన్‌రోడ్స్ : పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ ఈనెల 24వ తేదీ ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్ సభా భవనంలో నిర్వహిస్తున్నామని జిల్లా ఖజానా శాఖ ఉప సంచాలకులు ఎంఎస్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిన్సిపల్ అకౌంట్ జనరల్ ఆఫ్ విజయవాడ, సంచాలకులు రాష్ట్ర ఖజానాశాఖ సంయుక్తాధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించి పెన్షన్, జీపీఎఫ్‌లలో ఏవైనా సమస్యలు ఉంటే అదాలత్‌లో తెలియజేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

కడప రూరల్ : పోస్టుమెట్రిక్ రెన్యూవల్ స్కాలర్‌షిప్‌లకోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి కె.సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి కళాశాలలో చదువుతున్న అర్హులైన విద్యార్థులు వెంటనే కళాశాల జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో ఈనెల 30వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం విద్యార్థులు వెంటనే బయోమెట్రిక్ కూడా పూర్తి చేయాలన్నారు. కళాశాల యాజమాన్యాలు రెన్యూవల్ విద్యార్థుల రిజిస్ట్రేషన్ పూర్తి చేసి జిల్లా సంక్షేమశాఖకు ఆన్‌లైన్‌లో తక్షణమే పంపాలన్నారు.

ఎస్సీ విద్యార్థులు ఐపీపీబీ ఖాతాను తెరవాలి

భారత ప్రభుత్వం సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ విద్యార్థులు సమీప పోస్టాఫీసుల్లో ఐపీపీబీ ఖాతాను తెరవాలని తెలిపారు. ఆ మేరకు కళాశాల ప్రధానాచార్యులు తమ ఊరి పోస్టుమెన్ సహకారంతో కళాశాలలో అకౌంట్ ఓపెన్ క్యాంప్ నిర్వహించాలని సూచించారు. ఇందుకోసం కేవలం ఎస్సీ స్టూడెంట్ ఆధార్, మొబైల్ నెంబరు అవసరముంటుందని పేర్కొన్నారు. ఈ అకౌంటుకు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లింక్ వెంటనే అవడం వల్ల స్కాలర్‌షిప్ డబ్బులు ఇబ్బందులు లేకుండా క్రెడిట్ అవుతాయని వివరించారు.

పీఆర్‌టీయూ కార్యవర్గం ఎన్నిక

కడప ఎడ్యుకేషన్ : ఏపీ పీఆర్‌టీయూ వైఎస్సార్ జిల్లాలో గతంలో భర్తీకాకుండా ఖాళీగా ఉన్న పదవులకు నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్టా క్రిష్ణయ్య, ఎంవి గిరిప్రసాద్, రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ గుజ్జల తిరుపాల్ సమక్షంలో ఎన్నుకున్నారు. ఇందులో పీఆర్‌టీయూ వైఎస్సార్ కడప జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా యంవి కృష్ణప్రసాద్, జిల్లా కార్యదర్శిగా కె. రామాంజనేయరెడ్డిలను ఎన్నుకున్నారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఏర్పాటు


కడప ఎడ్యుకేషన్ : వైఎస్‌ఆర్ కడప జిల్లా యూటీఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కడపలోని యూటీఎఫ్ భవన్‌లో జరిగిన జిల్లా స్వర్ణోత్సవ మహాసభలలో ఈ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో జిల్లా అధ్యక్షుడిగా మాదన విజయకుమార్, ప్రధాన కార్యదర్శిగా పాలెం మహేష్ బాబు, జిల్లా గౌరవాధ్యక్షుడిగా నాగార్జున రెడ్డి, సహాధ్యక్షులుగా రవికుమార్, సుజాతరాణిలు, ట్రెజరర్‌గా నరసింహారావు, కార్యదర్శులుగా చెరుకూరి శ్రీనివాసులు, డి.వి.రవీంద్రుడు, చెన్నయ్య, సి.వి.రమణ, ఏజాస్ అహ్మద్, మురళీకృష్ణ, చంద్ర ఓబుల్ రెడ్డి, శ్రీనివాసులు, ప్రసన్నలక్ష్మి, శివ ప్రసాద్, ఈరి బాలజోజిలను ఎన్నుకున్నారు. అలాగే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పాలెం మహేష్ బాబు, మాదన విజయ కుమార్, రూతు ఆరోగ్య మేరీ, ఓబుల్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ప్రభాకర్, ఆడిట్ కమిటీ సభ్యులుగా ఎ.డి. దేవదత్తం, టి.వి.రమణ, రవిశంకర్, ఫయాజుద్దీన్, మేరి ప్రసన్నలు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవ కోటేశ్వరరావు, పరిశీలకులుగా రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజా వ్యవహరించారు.

ఉచిత డీఎస్సీ శిక్షణకు స్క్రీనింగ్ టెస్ట్

కడప రూరల్ : ప్రభుత్వ సాంఘిక గిరిజన సంక్షేమశాఖల ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ నిమిత్తం స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం టెట్ అర్హత కలిగి వార్షికాదాయం రూ. 2.50 లక్షల్లోపు ఉండాలని పేర్కొన్నారు. ఈ డీఎస్సీ శిక్షణ తీసుకునేందుకు అర్హతగల ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు రెండు రోజుల్లోపు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ స్క్రీనింగ్ టెస్ట్ పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో అర్హులైన మెరిట్ లిస్టు ప్రకారం ఉచిత డీఎస్సీ శిక్షణను పొందేందుకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జ్ఞానభూమి వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు.

అధనం కోసం పథకం!

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కుప్పం ఉప కాలువ పనులు వదిలేసిన కాంట్రాక్టు సంస్థలు
- అసంపూర్తి పనులు చేపట్టిన ఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ తప్పుకున్న వైనం
- టీడీపీ అధికారంలోకి రావడంతో దోచుకోవచ్చని ఐదేళ్ల తర్వాత మళ్లీ పనుల్లోకి రిత్విక్ సంస్థ



కుప్పం ఉప కాలువలో జరుగుతున్న పనులు (ఫైల్)



బి.కొత్తకోట : మీరు చేపట్టిన కుప్పం ఉప కాలువ పనులు అసంపూర్తిగా వదిలేశారు, తక్షణమే పనులు పూర్తి చేయండి అంటూ హంద్రీ–నీవా ప్రాజెక్టు ఉన్నతాధికారులు ఒకటికి పదిసార్లు నోటీసులు జారీ చేసినా కనీసం స్పందించని కాంట్రాక్టు సంస్థలు ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రావడంతో అందినకాడికి దోచుకోవచ్చని మళ్లీ వాలిపోయాయి. అదనం ఆశించకుండా పాత రేట్లకే పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థ పనుల నుంచి తప్పుకుని వెళ్లిపోయింది. ఐదేళ్లు ముఖం చాటేసిన కాంట్రాక్టు సంస్థ మళ్లీ పనులు చేపట్టడంతో గతంలో మాదిరి అదనం పేరుతో నిధులు దోచుకోవచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

గత టీడీపీ ప్రభుత్వంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా పెద్దతిప్పసముద్రం మండలం నుంచి పెద్దపంజాణీ వరకు పుంగనూరు ఉపకాలువ సాగుతుంది. ఇక్కడినుంచి పలమనేరు, కుప్పం నియోజకవర్గాల మీదుగా కుప్పం ఉప కాలువ తవ్వాలని నిర్ణయించారు. దీనిపై పనులకు 2015లో రూ.413 కోట్లతో టెండర్లు నిర్వహించగా 4శాతం అదనంతో రూ.430.27 కోట్లతో హెచ్‌ఈఎస్–ఆర్‌కే–కోయా జాయింట్ వెంచర్ కాంట్రాక్టు సంస్థ పనులు దక్కించుకుంది. పనులు సాగుతున్న మధ్యలో సీఎం చంద్రబాబుకు సన్నిహితుడైన సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్స్ కాంట్రాక్టు సంస్థకు ప్రభుత్వం భాగస్వామ్యం కల్పించింది. ఒప్పందం మేరకు 2016 అక్టోబర్ నాటికి పనులు పూర్తి చేయాలి. అయితే కాంట్రాక్టు సంస్థ పనులు పూర్తి చేయకపోగా అదనంగా పనులు చేసినట్టు కాంట్రాక్టు సంస్థకు రూ.144.7 కోట్లు చెల్లించడంతో పని విలువ రూ.574.96 కోట్లకు చేరింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పనులు వదిలేసి..

అదనం పేరుతో దండుకున్న కాంట్రాక్టు సంస్థ 79.62 శాతం పనులు చేశాక 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాకతో ఎక్కడి పనులు అక్కడే వదిలేసి వెళ్లిపోయింది. పనులను పూర్తి చేయించేందుకు ప్రభుత్వం కాంట్రాక్టు సంస్థలతో సంప్రదింపులు జరిపింది. పలుమార్లు నోటీసులు ఇచ్చినా పనులు చేపట్టలేదు. దీంతో రూ.117.17 కోట్ల విలువైన 4.800 కిలోమీటర్ల కాలువ తవ్వకం, 101 స్ట్రక్చర్స్ నిర్మాణ పనులు, 8,32,141 క్యూబిక్ మీటర్ల మట్టి పనులు, 40,360 క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పనులు, మూడు ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన పెండింగ్ పనులు, రోడ్ కటింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనులు చేపడితే పూర్తిగా సహకరిస్తుందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుప్పంకు కృష్ణా జలాలను తరలించాలన్న సంకల్పంతో ఉన్నారని స్పష్టంగా పేర్కొంటూ అభ్యర్థించినా కాంట్రాక్టు సంస్థలో చలనం లేదు.

జగన్ చొరవతో పనులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ చొరవతో అసంపూర్తి పనులను టీడీపీ హయాంలో జరిగిన ఒప్పంద విలువకే పూర్తి చేసేలా హైదరాబాద్‌కు చెందిన ఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ అంగీకరించి ముందుకు రాగా రూ.117.17 కోట్ల పనులను అప్పగించారు. టెండర్ల ద్వారా ఈ పనులు అప్పగించి ఉంటే ఇప్పటి ఎస్‌ఎస్‌ఆర్ ధరల ప్రకారం చెల్లింపులు చేయాల్సి వచ్చేది. దీనివల్ల ప్రభుత్వానికి రూ.25 కోట్ల మేర ఆదా అయింది. ఈ సంస్థ గత ఎన్నికల నాటికి రూ.40.40 కోట్ల పనులు పూర్తి చేయగా రూ.59 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనులు చేపట్టడం వల్లే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం హోదాలో కుప్పంకు కృష్ణా జలాలను విడుదల చేశారు. మూడు చెరువులకు నీటిని అందించారు.

అధికారం వచ్చిందని వాలిపోయారు

హెచ్‌ఈఎస్–ఆర్‌కే–కోయా జాయింట్ వెంచర్ కాంట్రాక్టు సంస్థ తొమ్మిది నెలల్లో పనులు పూర్తి చేయాలన్నది ఒప్పందం. అయితే సీఎం చంద్రబాబు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పానికి కృష్ణా జలాలు తరలించే కాలువ పనులు పూర్తి చేయించడం ఇష్టం లేక గడువు మీద గడువు ఇస్తూ కాలయాపన చేశారు. దీంతో పనులు పూర్తి చేయకపోగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే వెళ్లి పోయిన ఈ సంస్థ మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో ఐదేళ్ల తర్వాత కుప్పం కాలువ పనుల్లోకి వాలిపోయింది. దీనికి అసలు కాంట్రాక్టు సంస్థ మాదే..ఈ పనులు మేమే చేస్తామంటూ ముందుకొచ్చింది. వడ్డించే వాడు మనవాడే కాబట్టి ఇప్పుడు కుప్పం ఉప కాలువ అసంపూర్తి పనులు చేపట్టారు. వీరి రాకతో పనులు చేస్తున్న ఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ పనులు వదులుకుని వెళ్లిపోయింది. సీఎం చంద్రబాబుకు సన్నిహితుడైన సీఎం రమేష్ సంస్థ ఈ పనులు చేపట్టడంతో అంచనాలు పెంచుకుంటారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గత టీడీపీ హయాంలో అడ్డగోలుగా పనులు చేపట్టి అదనంగా పనులు చేశామన్న నెపంతో రెండు ప్రత్యేక జీఓల ద్వారా రూ.144.7 కోట్లను దోచిపెట్టింది. ప్రస్తుతం అధికారం టీడీపీదే కావడంతో కొత్త ఎస్‌ఎస్‌ఆర్ రేట్ల ప్రకారం చెల్లింపులు చేయాలనో, ఇంకా ఏవేవో పనులు అదనంగా చేశామనో నిధుల దోపిడీకి స్కెచ్ వేసే ప్రయత్నాలు జరిగే అవకాశాలు లేకపోలేదు. ఈ విషయమై హంద్రీ–నీవా ప్రాజెక్టు ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ జాయింట్ వెంచర్ సంస్థ మళ్లీ పనులు చేపట్టిందని, ఇప్పటిదాకా పనులు చేసిన ఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ పనుల నుంచి తప్పుకుందని తెలిపారు.

గండికోట లోగో, ట్యాగ్‌లైన్ ఆవిష్కరణ



గండికోట లోగో, ట్యాగ్‌లైన్ ఆవిష్కరిస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : గండికోట వారసత్వం, సంస్కృతి ప్రతిబింబించే విధంగా సృజనాత్మకమైన లోగో, ట్యాగ్‌లైన్‌ను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్, వైఎస్సార్‌జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ అధికారి సురేష్‌కుమార్ అధికారికంగా ప్రకటించారు. లోగో డిజైన్ పోటీలో గెలుపొందిన తుషార్ సివాంకర్‌ను అభినందించారు. గండికోటలో పర్యాటకం పెంచడమే కాకుండా గండికోట అందించే ప్రత్యేక అనుభవాలను హైలెట్ చేయడం కోసం రూపొందించారని సురేష్‌కుమార్ తెలిపారు.

ఇన్‌చార్జి కలెక్టర్‌తో ఎయిర్ ఫోర్స్ అధికారుల భేటీ

కడప సెవెన్‌రోడ్స్ : ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారులు సోమవారం ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగ అవకాశాలకు యువతకు ఆహ్వాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు తాము జిల్లాకు వచ్చామని నాన్ కమిషన్డ్ అధికారులు ఎస్.సందీప్, సురేంద్రసింగ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా ఐఏఎఫ్ కిట్‌ను ఇన్‌ఛార్జి కలెక్టర్‌కు అందజేసి ఆమె చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరింపజేశారు. ఆ తర్వాత అన్నమయ్య ఇంజనీరింగ్ కళాశాల, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఐఏఎఫ్ అధికారులు యువతకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వీరితోపాటు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్, నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి శ్రీమణికంఠ, సెట్ప్ అధికారులు పాల్గొన్నారు.

పల్లకీలో ఊరేగిన శ్రీ వీరభద్రస్వామి



పల్లకీలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు సోమవారం రాత్రి మూల విరాట్‌లకు స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అందంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, పూజలు నిర్వహించి రంగు రంగుల పూలు, బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించి ఆలయ మాఢ వీధులలో, ఆలయ ప్రాంగణంలో పల్లకీలో ఊరేగించారు. ఈ పల్లకీ సేవలో స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా పాల్గొన్నారు. భక్తులకు మంగళ హారతులు, తీర్థప్రసాదాలు అందజేశారు.

హత్యాచారం ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



రాయచోటిలో కొవ్వొత్తుల ర్యాలీలో దూదేకుల సంఘం, ప్రజా సంఘాల నాయకులు

రాయచోటి (జగదాంబసెంటర్) : వైఎస్‌ఆర్ జిల్లా బద్వేలులో ఇంటర్మీడియట్ విద్యార్థిని దస్తగిరమ్మపై అత్యాచారం చేసి కిరాతకంగా కాల్చి చంపిన ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ రాయచోటి పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సోమవారం రాత్రి పలువురు దూదేకుల సంఘాల ప్రతినిధులు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వేంపల్లె రోడ్డు నుంచి ర్యాలీ ప్రారంభమై పురవీధుల గుండా సాగింది. నిందితుడికి కఠిన శిక్ష విధించి మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

అమరుల అంకితభావంతోనే సురక్షిత సమాజం



అమర వీరుల స్థూపం వద్ద సెల్యూట్ చేస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు



అమర వీరుల కుటుంబీకులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి : పోలీసు అమరవీరుల ధైర్యం, నిబద్ధత అకింతభావం వలన సురక్షితమైన సమాజం నిర్మితమవుతుందని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సోమవారం జిల్లా పోలీసు పెరెడ్ మైదానంలో జిల్లా కలెక్టర్ సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అమరులైన పోలీసులకు జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసు సంస్మరణ దినం కేవలం మనం కోల్పోయిన పోలీసులకు సంతాపం తెలిపే రోజు మాత్రమే కాదని, సమాజంలోని ప్రజలకు తమ ప్రాణాల కంటే ఎక్కువగా భద్రత కల్పించే వారి ధైర్యానికి, నిబద్ధతకు, అకింతభావానికి సెల్యూట్ చేసే రోజని పేర్కొన్నారు. నిజాయితీగా, నిస్వార్థంగా ఉండడం , ఆపద వచ్చినప్పుడు ధైర్యంగా నిలబడడం, గౌరవంగా సేవ చేయడం అంటే ఏమిటో వారు మనకు తెలియజేశారన్నారు. వారి నిరివ్రామ కృషి వల్లనే మనం స్వేచ్ఛ, భద్రత, జీవన విధానాన్ని ఆస్వాదించగలుగుతున్నామని తెలిపారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. కోవిడ్ –19పై పోరాడుతున్న సమయంలో పోలీసులు లేని సమాజాన్ని మనం ఊహించలేమన్నారు. 1999లో నక్సల్స్ చేతిలో హతమైన ఉమేష్ చంద్ర, గ్రేహౌండ్స్ ఫోర్సును ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించిన కేఎస్ వ్యాస్, 2008లో జరిగిన 26/11 ముంబై ఆటాక్స్‌లో ప్రాణాలు కోల్పోయిన ఆశోక్ లాంటి వారు చూపించిన ధైర్య సాహసాలు మనందరికీ ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమన్నారు.

అమరులైన పోలీసులకు జోహార్లు

విధి నిర్వహణలో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణలో అమరులైన పోలీసులకు జోహార్లు అర్పిస్తున్నట్లు జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. దేశ భద్రత కోసం పగలనకా, రేయనకా విధులు నిర్వహిస్తూ ప్రాణ త్యాగాలకు సైతం వెనుకాడని పోలీసుల త్యాగాన్ని కొనియాడటం మనందరి కర్తవ్యమన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా విధి నిర్వహణలో పోలీసుల వీర మరణాల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతూనే ఉందన్నారు. అయినా ధైర్యంతో పోలీసులు ముందుకు దూసుకుపోతూనే ఉన్నారన్నారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, కరుడుగట్టిన మతోన్మాదం, మితిమీరిపోతున్న తరుణంలో పోలీసు వృత్తి ప్రాణాలతో చెలగాటమని తెలిసి కూడా వాటిని లెక్కచేయక ప్రజా సేవలో నిమగ్నం అవుతున్నామన్నారు. అగ్ని ప్రమాదాలు, తుపానులు సంభవించే సందర్భాలలో కూడా పోలీసుల పాత్ర చాలా కీలకంగా ఉందన్నారు. అనంతరం పోలీసు అమరవీరుల కుటుంబాలకు కుట్టుమిషన్లు, సైకిళ్లు తదితర వస్తువులను జిల్లా కలెక్టర్, ఎస్పీ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేష్ పాల్గొని అమర వీరులకు ఘన నివాళులు అర్పించారు.

చేపల కోసం అధికారులకు గాలం

- బహిరంగ వేలం కాకుండా గుట్టుగా రెన్యువల్‌కు ప్రయత్నాలు
- రెన్యువల్ చేస్తే ప్రతిఘటిస్తామంటున్న ప్రజలు




రంగసముద్రం చెరువు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రంగసముద్రం చెరువులో చేపల పెంపకం కోసం గత ఏడాది ఆగస్టు 3న రాపూరివాండ్లపల్లి గ్రామ సచివాలయం ఎదుట బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఇందులో ఏడాది ఫసలీకి రూ.15.10 లక్షలకు హెచ్చు పాటదారుడు దక్కించుకున్నాడు. అయితే ఫసలీకి ఈ ఏడాది ఆగస్టుకే గడువు ముగియడంతో ఎలాగైనా అధికారులను మచ్చిక చేసుకుని వేలం పాటలు మళ్లీ నిర్వహించకుండా రెన్యువల్ చేసుకునేందుకు టీడీపీ నాయకులు గుట్టుగా ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఏడాది చేపల చెరువును వేలంలో దక్కించుకుని భాగస్వాములైన వ్యక్తులు అధికార పార్టీ రాజకీయ పలుకుబడితో మళ్లీ తమకే రెన్యువల్ అవుతుందనే ధీమాతో ఇటీవల రూ.లక్షలు వెచ్చించి చెరువులో చేపల పిల్లలు వదిలారని సమాచారం. ఈ విషయంపై నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడి ద్వారా కూడా డివిజన్ స్థాయి అధికారికి ఫోన్ చేయించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా మండల కేంద్రంలోని అద్దె ఇంట్లో కాపురం ఉంటున్న ఓ అధికారి ఇంటికి రాత్రి వేళ పలువురు వ్యక్తులు వచ్చి రెన్యువల్ విషయంలో నిత్యం గంటల కొద్దీ మంతనాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మండల స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు ఏదో విధంగా అధికారులకు డబ్బు ఎరతో చేతులు తడిపి రహస్యంగా రెన్యువల్ చేసుకునేందుకు కౌలుదారులు తాపత్రయ పడుతున్నారు. అయితే వేలం పాటలు నిర్వహించకుండా గుట్టుగా రెన్యువల్ చేస్తే జిల్లా స్థాయి అధికారులు, ప్రజల నుంచి ఎలాంటి ఇబ్బందులు వస్తాయోనని అయోమయంలో పడ్డ కింది స్థాయి అధికారులు వెనకడుగు వేస్తున్నట్లు సమాచారం. వారం, పది రోజుల్లో వేరే జిల్లాకు బదిలీ అయ్యే తనకు ఇలాంటి తలనొప్పి తెచ్చి పెట్టే పని ఎందుకని ఓ అధికారి భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా రెన్యువల్‌కు నిరాకరిస్తూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శించే వారికి, పంచాయతీలో కాస్త పలుకుబడి ఉన్న ఇద్దరు, ముగ్గురు వ్యక్తులకు చెక్‌డ్యాం పనులు చేసుకోండి, బిల్లులు తామే దగ్గరుండి పెట్టిస్తాం, చెరువు విషయంలో ఏం పట్టించుకోరాదని కౌలుదారులు ఎర వేసినట్టు సమాచారం. కాగా చేపల చెరువును మళ్లీ బహిరంగంగా వేలం వేయాల్సిందేనని, ఒకవేళ రాజకీయ ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గి గుట్టుగా రెన్యువల్ చేస్తే తామంతా ప్రతిఘటిస్తామని పంచాయతీ ప్రజలు బహిరంగంగా చెబుతున్నారు. ఈ విషయంపై ఈఓఆర్డీ యోగానంద్‌ను వివరణ కోరగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, ప్రజాభీష్టం మేరకు కచ్చితంగా చేపల చెరువుకు వేలం పాటలు నిర్వహిస్తామని వెల్లడించారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



ప్రజల సమస్యలను వింటున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపరాదని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెకట్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్ఓ సత్యనారాయణరావు, ఆర్డీఓ రంగస్వామి, ఎస్‌డీసీ రామసుబ్బయ్య ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా ఫిర్యాదులకు పరిష్కారం

జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు



ప్రజలతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

రాయచోటి (జగదాంబసెంటర్) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి జిల్లా ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. దివ్యాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

రామసముద్రం : గుర్తు తెలియని వాహనం ఢీకొని స్కూటరిస్టుకు గాయాలైన సంఘటన రామసముద్రంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా, పేగలహల్లికి చెందిన గంగాధర్ (29) ఆదివారం సొంత పని ముగించుకుని రాత్రి తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా మార్గమధ్యంలోని రామసముద్రం మండలం కాప్పల్లి వద్ద కారు బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో గంగాధర్ తీవ్రంగా గాయపడగా మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట సుబ్బయ్య తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పెద్దమండ్యం : మహిళ అదృశ్యంపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పివి రమణ తెలిపారు. ఎస్ వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కలిచెర్ల పెద్దమసీదులో శాషవలీ (32) నమాజ్ చదివిస్తూ జీవనం సాగిస్తున్నారు.

ఇతని స్వగ్రామం వైఎస్సార్ కడప జిల్లా దువ్వూరు కాగా, బెంగళూరు నగరంలోని నూర్ మహమ్మద్ పెద్ద కుమార్తె హీనా (26)తో వివాహమై ఏడు సంవత్సరాలు అవుతోంది. వీరికి ముగ్గురు పిల్లలు. మసీదు వద్దనే నిర్వాహకులు ఇంటి వసతి కల్పించడంతో అక్కడే ఉంటున్నారు. అయితే గత నెల 29న ఉదయం మసీదుకు వెళ్లి నమాజ్ చేసుకుని వచ్చి నిద్ర పోగా 9 గంటల సమయంలో ఇంటి నుండి భార్య బయటకు వెళ్లింది. ఇంటికి తిరిగి రాలేదు. విచారించినా భార్య ఆచూకి తెలియ లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. భర్త ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రైవింగ్‌లో అత్యుత్తమ శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపలోని ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలు ద్వారా అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నామని, దీనిని డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వర్‌రావు తెలిపారు. ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలు చేరిన 22వ బ్యాచ్ అభ్యర్థులకు సోమవారం మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 21 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తయిందని, 22వ బ్యాచ్‌కు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఒక్కో బ్యాచ్‌లో 16 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. 30 ఏళ్ల అనుభవం కలిగిన రీజినల్‌సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ల చేత థియరీ, ప్రాక్టికల్ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

నాన్ రెసిడెన్షియల్ రిఫ్రెషర్ కోర్సు

ప్రభుత్వ నిబంధనల మేరకు రవాణాశాఖ అనుమతితో ఒకరోజు నాన్ రెసిడెన్షియల్ రిఫ్రెషర్ కోర్సు ఏపీఎస్ ఆర్టీసీ హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ స్కూలు కడపలో శిక్షణ తీసుకుని సర్టిఫికెట్ పొంది లైసెన్సును రెన్యూవల్ చేసుకోవచ్చునికడప డిపో మేనేజర్ డిల్లీశ్వర్‌రావు తెలిపారు. ఒకరోజు నాన్ రెసిడెన్షియల్ ట్రైనింగ్ కోర్సు కోసం రూ.1000 ఫీజుతోపాటు 18 శాతం జీఎస్టీ అదనమన్నారు. ట్రైనింగ్‌లో చేరేందుకు ముందుగా ఫీజు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. అనంతరం ఒకరోజు ట్రైనింగ్ పూర్తయ్యాక సర్టిఫికెట్ ఇస్తారన్నారు. ఇతర వివరాలకు 99592 25774, 738828 65145 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు


కోతుల గుట్ట ప్రాంతంలో ఉన్న పురాతన ఆంజనేయస్వామి ఆలయం

- ఆంజనేయస్వామి మండపం కూల్చివేత
- గుప్తనిధుల ముఠా ఘాతుకం

గుర్రంకొండ : ఆంజనేయస్వామి మండపాన్ని జేసీబీతో కూల్చి మండపం కింద గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన సంఘటన ఆదివారం రాత్రి మండల కేంద్రమైన గుర్రంకొండకు సమీపంలో జరిగింది. గుర్రంకొండ- సంగసముద్రం గ్రామాల సరిహద్దులో కోతుల గుట్ట ప్రాంతంలో తుపాలకుంట వద్ద పురాతన ఆంజనేయస్వామి ఆలయం ఉంది. గతంలో భక్తులు ఎక్కువగా ఆలయానికి వచ్చి పూజలు నిర్వహించేవారు. నిర్మానుష్యమైన ప్రాంతంలో ఆలయం ఉండడంతో గుప్తనిధుల తవ్వే ముఠా సభ్యుల కళ్లు ఈ గుడిపై పడింది. గత రాత్రి జేసీబీ తీసుకొచ్చి ముందుగా ఆలయానికి ఓవైపు ఉన్న మండపాన్ని, స్తంభాల్ని తొలగించారు. తొలగించిన మండపం కింది భాగంలో జేసీబీలతో రాత్రిళ్లు తవ్వకాలు జరిపారు. తవ్వకాలను కొంత భాగం మట్టితో పూడ్చివేసిన ఆనవాళ్లు ఉన్నాయి. తవ్వకాలు జరిపే సమయంలో పెద్ద ఎత్తున పూజలు అష్ట దిగ్బంధనం చేసిన దృశ్యాలు కనిపిస్తుండడం గమనార్హం. గుప్తనిధుల లభించాయనే ఊహాగానాలు గుప్పుమన్నాయి. రాత్రిళ్లు చుట్టుపక్కల ఉన్న దాబాల దగ్గరే గుప్తనిధుల ముఠాసభ్యులు మకాం వేస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు. సోమవారం గొర్రెల కాపరులు తుపాకుల కుంట వద్దకు గొర్రెలను కాచుకోవడానికి వెళ్లి జరిగిన సంఘటనను చూసి గ్రామస్తులకు తెలియజేశారు. విషయం తెలుసుకొన్న ఎస్ఐ మధు తమ సిబ్బందితో కలిసి వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. జరిగిన సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకొంటామని ఆయన పేర్కొన్నారు.


ఆలయానికి ఓవైపు ఉన్న మండపాన్ని తొలగించి జేసీబీతో తవ్వకాలు జరిపిన దృశ్యం

టమాటా రైతుపై గంజాయిమూకల దాడి


దాడిలో గాయపడ్డ రైతు మల్లికార్జున


మార్కెట్ యార్డులో ఆందోళనకు దిగిన రైతులు

- మార్కెట్ యార్డులో ఉద్రిక్తత
- తిరగబడిన రైతులు

గుర్రంకొండ : టమాటా రైతుపై గంజాయి మూకలు ఒక్కసారిగా దాడి చేయడంతో రైతుకు తీవ్ర రక్తగాయాలు అయ్యాయి. దీంతో రైతులంతా తిరగబడటంతో గుర్రకొండ మార్కెట్ యార్డులో ఉద్రికత నెలకింది. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం మండలంలోని ఎల్లుట్ల గ్రామానికి చెందిన రైతు ఎం. మల్లికార్జున టమాటాలను మార్కెట్‌కు తీసుకొచ్చాడు. మండీల వద్ద వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది. మండీ ముందు వైపు టమాటా లోడ్ దించేసి ఖాళీగా ఉన్న ట్రాక్టర్‌ను పక్కకు తీయాల్సిందిగా రైతు మల్లికార్జున డ్రైవర్‌ను కోరాడు. ఈ విషయమై ఇరువురి నడుమ వాగ్వాదం చోటు చేసుకొంది. ఈసంఘటనకు సంబంధం లేని గంజాయి మూకలు ఒక్కసారిగా ఈ వివాదంలోకి వచ్చారు. 15 మంది రైతు మల్లికార్జునపై మూకుమ్మడిగా దాడి చేశారు. ఇదేమిటని అడ్డుకోబోయిన వారిపై కూడా దాడులకు దిగారు. రైతుకు తీవ్ర రక్తగాయాలు కావడంతో ఆగ్రహించిన రైతులు ఒక్కసారిగా గంజాయిమూకలపై తిరగబడ్డారు. రైతులు ఎక్కడ దాడి చేస్తారోనని గంజాయి మూకలు పరుగులు తీసి మార్కెట్ యార్డులో ఓ గదిలోకి వెళ్లి దాక్కొన్నారు. విషయం తెలుసుకొన్న ఎస్ఐ మధు తమ సిబ్బందితో కలసి సంఘటనా స్థలం వద్దకు చేరుకొని విచారించారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకొంటామని ఎస్ఐ హామీ ఇచ్చారు. మార్కెట్ యార్డులో రైతుపై దాడి పట్టణంలో సంచలనం కలిగించింది.

ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న గంగులమ్మ (ఫైల్)

మదనపల్లె : ఒంటరితనంతో మనస్తాపం చెందిన మహిళ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. టూ టౌన్ పరిధిలోని అమ్మ చెరువు మిట్ట, గంగమ్మ గుడి ఎదురుగా నివాసం ఉన్న డేరింగుల రమణ భార్య గంగులమ్మ (50) నీరుగట్టువారి పల్లెలోని మార్కెట్ యార్డులో దినసరి కూలీగా పనిచేస్తూ జీవిస్తోంది. భర్త రమణ 30 ఏళ్ల క్రితమే మృతి చెందగా, ఒంటరిగా ఉంటోంది. ఆమె ఇంటి పక్కనే కుమార్తె రమ, తన భర్తతో కలిసి నివసిస్తోంది. నెల రోజుల క్రితం మార్కెట్ యార్డులో పని మానేసి, స్థానికంగా ఉన్న స్కూల్లో పనికి చేరింది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఒంటరి జీవితాన్ని భరించలేక మనస్తాపం చెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం తల్లిని పలకరించేందుకు వెళ్లిన కుమార్తె రమ, తల్లి గంగులమ్మ ఉరి వేసుకుని ఉండటం కిటికీలోనుంచి చూసింది. దీంతో పెద్దగా కేకలు వేస్తూ చుట్టుపక్కల వారిని పిలిచి, టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించింది.

137 మద్యం బాటిళ్లు స్వాధీనం

పెద్దమండ్యం : మండలంలోని కోటకాడపల్లె పంచాయతీ చెరువుకిందపల్లె వద్ద 137 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పివి రమణ సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. చెరువుకిందపల్లెకు సమీపంలో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. విక్రయించేందుకు పల్లెకు పడమర వైపున బీడు భూములలో గ్రామానికి చెందిన సుదర్శన మద్యం ఉంచినట్లు గుర్తించామని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయాలు, నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

విద్యార్థులకు రాష్ట్ర స్థాయి అవార్డులు


అవార్డుకు ఎంపికైన భార్గవి


అవార్డుకు ఎంపికైన కార్తీక్

కురబలకోట : అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ ఈఈఈ విద్యార్థి కాగితి భార్గవికి బెస్ట్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విద్యార్థి అవార్డు, సీఎస్‌సీ విద్యార్థి కార్తీక్ కోవి బెస్ట్ స్టూడెంట్ ఇన్నోవేటర్ రాష్ట్ర అవార్డులకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ సోమవారం తెలిపారు.ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఈ అవార్డులకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వీరిని ఎంపిక చేశారని తెలిపారు. ఇదివరకే ఈ కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్‌ను బెస్ట్ ప్రిన్సిపాల్‌గా ఎంపిక చేశారు. ఇప్పుడు ఇద్దరు విద్యార్థులతో కలిపి మొత్తం ముగ్గురు ఈ కళాశాల నుండి రాష్ట్ర అవార్డులకు ఎంపికయ్యారు. ఈనెల 25న కర్నూలులోని జి. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో అవార్డులను అందుకుంటారని వారు తెలిపారు.

ఇళ్ల మధ్య మద్యం దుకాణాన్ని తొలగించండి

సబ్ కలెక్టర్‌కు మహిళల వినతి


చెట్టువిరిగి గాయపడిన తండ్రి వైద్యఖర్చులకు సహాయం చేయాలని సబ్‌కలెక్టర్‌కు విన్నవిస్తున్న కుమార్తెలు

మదనపల్లె : మున్సిపాలిటీ పరిధిలోని సీటీఎంరోడ్డు బాపూజీపార్కు ఎదురుగా ఇళ్ల మధ్య ఏర్పాటుచేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని స్థానిక మహిళలు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతిచేశారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో బాపూజీపార్క్ పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు సబ్ కలెక్టర్‌ను కలిసి గతంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే, అందరం కలిసి రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులకు విన్నవించుకుంటే, ఏర్పాటు చేసిన దుకాణాన్ని తొలగించారన్నారు. ప్రస్తుతం తొలగించిన దుకాణంలోనే ప్రైవేట్ వ్యక్తులు మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేస్తున్నారని, తక్షణం దీనిని నిలుపుదల చేయించి వేరొకచోటకి తరలించేలా చూడాలన్నారు. సబ్ కలెక్టరేట్ ఆవరణలోని చింతచెట్టు వర్షాలకు విరిగి రోడ్డుపై పడటంతో, అటుగా వెళుతున్న తమ తండ్రి చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడ్డాడని, పేదరికంతో అతడికి వైద్యం చేయించేందుకు ఇబ్బందులు పడుతున్నామని కుమార్తె భార్గవి సబ్ కలెక్టర్‌ను వేడుకుంది. వృద్ధుడైన తమ తండ్రికి ప్రమాదంలో కాళ్లు విరగడంతో పాటు నడుం పూర్తిగా దెబ్బతిని లేవలేని స్థితిలో ఉన్నారని, వైద్య ఖర్చులకు సహాయపడాల్సిందిగా విన్నవించారు.

మద్యం షాపును తరలించాలని నిరసన


నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు

కడప సెవెన్‌రోడ్స్ : తమ గ్రామంలో ఏర్పాటు చేసిన మద్యం షాపును జనావాసాల నుంచి ఇతర ప్రదేశాలకు తరలించాలని సిద్దవటం మండలం ఉప్పరపల్లె పంచాయతీ సాయినగర్ మహిళలు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. నివాసాల మధ్య రామాలయం, సాయిబాబా ఆలయం, కాన్వెంట్ స్కూలు ఉండగా, ఆ ప్రాంతంలో మద్యం దుకాణం ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లగా సిద్దవటం పోలీసులు మహిళలైన తమ పట్ల దురుసుగా ప్రవర్తించడం తీవ్ర విచారకరమన్నారు. ఈ విషయంపై విచారణ చేపట్టి మద్యం దుకాణాన్ని వేరే చోటకు తరలించి తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం జేసీ అదితిసింగ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

చిరుతల సంచారంతో భయాందోళన

వేముల : మండలంలోని పెండ్లూరు చెరువు పరిసర ప్రాంతాలలో చిరుతల సంచారంతో ప్రజలలో భయాందోళనలు నెలకొన్నాయి. ఆదివారం గొర్రెల కాపరులకు ఓ చిరుత కనిపించగా.. సోమవారం కూడా గొర్రెల కాపరులకు రెండు చిరుతలు కనిపించినట్లు చెబుతున్నారు. చిరుతలు సంచరిస్తుండటంతో సమీప పొలాల్లో రైతులు, కూలీలు పనులకు వెళ్లేందుకు భయపడుతున్నారు. చెరువు ప్రాంతంలో ముళ్ల పొద లు అధికంగా ఉండటంతో అక్కడ చిరుతలు సంచరిస్తున్నాయని గ్రామస్తులు అంటున్నారు. ముఖ్యంగా పెండ్లూరు, పెర్నపాడు గ్రామాల మధ్య ఉన్న చెరువు ప్రాంతంలోని పొలాల్లో పంటలు సాగు చేయడంతో పనులు ఉన్నప్పటికి చిరుతల సంచారంతో పొలాల్లోకి వెళ్లేందుకు ఆయా గ్రామాల ప్రజలు జంకుతున్నారు.

పోలీస్ స్టేషన్‌లో కుప్పకూలిన వ్యక్తి



- సీపీఆర్ చేసినా కాపాడలేకపోయిన పోలీసులు
- గుండె పోటుతో వ్యక్తి మృతి

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయరెడ్డిపల్లె పంచాయతీ కొండావాండ్లపల్లెకు చెందిన రేపన దేవరాజు (55) అనే వ్యక్తి సోమవారం గుండె పోటుతో మృతి చెందినట్లు బంధువులు, పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. దేవరాజు కూతురు జ్యోతి ఆమె ఆడబిడ్డ అంజనమ్మ మధ్య కొంత కాలంగా తగాదాలు వుండేవి. ఈ క్రమంలోనే అంజనమ్మ అన్నమయ్య జిల్లా కేంద్రంలో గ్రీవెన్‌సెల్‌కు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలోనే ఇరువురిని సంబేపల్లె పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. దేవరాజు, అయన భార్య పార్వతీ కూడా వచ్చారు. అంజనమ్మ, రామాంజులు (దేవరాజు అల్లుడు) మాట్లాడుతుండగా దేవరాజు కుర్చీలోనే కుప్పకూలాడు. వెంటనే స్థానిక పోలీసులు దేవరాజుకు సీపీఆర్ చేశారు. వెంటనే 108 సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే దేవరాజు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సంబేపల్లె పోలీస్‌స్టేషన దగ్గర దేవరాజు మృతదేహంతో బంధువులు నిరసన తెలిపారు. సంఘటనా స్థలానికి డీఎస్పీ కృష్ణమోహన్ , రూరల్ సీఐ వరప్రసాద్ చేరుకొని బాధితులతో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌లోని సీసీ పుటేజ్ పరిశీలించారు.

మదనపల్లె వైద్యకళాశాలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించాలి

బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెలగౌతమ్


సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

మదనపల్లె : మదనపల్లె మెడికల్ కాలేజీని ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని, ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలన్న దురాలోచనను కూటమి ప్రభుత్వం మానుకోవాలని బహుజన్ సమాజ్‌పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఎదుట మదనపల్లె మెడికల్ కళాశాల ప్రభుత్వ గుర్తింపు రద్దును వ్యతిరేకిస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బందెల గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతిభ కలిగిన పేదవిద్యార్థులు వైద్యవిద్యను అభ్యసించేందుకు, స్థానికులకు సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలను అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మదనపల్లె మెడికల్ కళాశాలను మంజూరు చేయడమే కాకుండా 80శాతం మేర పనులు పూర్తి చేందన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేదిశగా ఏర్పాట్లు జరుగుతున్న తరుణంలో.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్వహణకు తమవద్ద నిధులు లేవని, ఎన్ఎంసీకి లేఖ రాసిందన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన మెడికల్ కళాశాలను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు ప్రయత్నాలు సాగిస్తోందన్నారు. పేదవిద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేసేందుకు కుట్రపన్నుతున్నారని, దీనిని ఏమాత్రం సాగనివ్వమని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రమణ, ఉదయ్, గంగాధర్, లక్ష్మీపతి, సంధ్య, శివప్రసాద్, మహేష్, ప్రశాంత్, ఆనంద్‌చేతన్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో నిరాధార పోస్టులు

నలుగురిపై కేసు నమోదు

కురబలకోట : ఓ మహిళను కించపరుస్తూ మరో మహిళ సోషల్ మీడియాలో నిరాధార పోస్టులు పెట్టడంతో ముదివేడు పోలీసులు సోమవారం నలుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ దిలీప్‌కుమార్ కథనం మేరకు..కురబలకోట మండలం అంగళ్లుకు చెందిన కోటకొండ వాణి హ్యూమన్ రైట్స్ సంస్థలో పనిచేస్తోంది. అలాగే తిరుపతికి చెందిన చంద్రకళ కూడా అదే సంస్థలో పని చేస్తోంది. వీరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఇటీవల చంద్రకళను హ్యూమన్ రైట్స్ సంస్థ నుంచి నిర్వాహకులు తొలగించారు. ఇందుకు అంగళ్లుకు చెందిన వాణి కారణంగా ఆమె భావించారు. దీంతో చంద్రకళ వాణిపై వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్ తదితర సోషల్ మీడియా నెట్‌వర్క్ గ్రూపులలో వాణిని కించపరిచేలా చెడుగా పోస్టులు పెట్టారు. సోషల్ మీడియాలో హల్ చల్ చేశాయి. దీనిని అవమానంగా భావించిన బాధిత మహిళ వాణి ముదివేడు పోలీసులకు చంద్రకళతో పాటు ఇందులో ప్రమేయం ఉన్న శెట్టి సుజాత రాణి, రౌడీషీటర్ దేవ, నాగమణిపై ఫిర్యాదు చేసింది. విచారించి వీరిపై కేసు నమోదు చేసినట్లు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. ఆధారాలు లేకుండా సోషల్ మీడియాలో మరొకరిపై తప్పుడు ప్రచారం చేయడం, అవమానించడం, వ్యక్తిగత దూషణ, అనుచిత వ్యాఖ్యలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ట్రాక్టర్లను అడ్డుకున్న టీడీపీ శ్రేణులు


పాపాఘ్ని నదిలో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం ఇసుకను ఎద్దుల బండి, ట్రాక్టర్లతో ఉచితంగా తీసుకోవచ్చని చెప్పడంతో వేంపల్లి పాపాగ్ని నదిలో ఇసుక ట్రాక్టర్ల జాతర మొదలైంది. రోజుకు 200కు పైగా ట్రాక్టర్లు నది నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు సంబంధించిన ట్రాక్టర్లు పాపాగ్ని నదిలోకి రాకుండా అడ్డుకుంటున్నారు. దీంతో వారి ఇరువురు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈక్రమంలో వేంపల్లి సీఐ సురేష్ రెడ్డి జోక్యం చేసుకుని ఇంటి అవసరాలకు మాత్రమే ట్రాక్టర్లతో ఇసుకను ఎవరైనా తీసుకెళ్లవచ్చునని వారిరువురికి సర్ది చెప్పి పంపించారు. అలాగే తాగునీటికి ఇబ్బందులు లేకుండా దూర ప్రాంతం నుంచి ఇసుకను తీసుకెళ్లాలని సూచించారు. ఈ విషయమై తహసీల్దార్‌తో మాట్లాడి రైతులకు, ప్రజలకు నీటి సమస్య రాకుండా రెవెన్యూ, పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయిస్తామన్నారు. ఇంటి అవసరాలకు తప్ప ఇతర వాటికి ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పరువు కోసమే యువకుడి హత్య

- కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్
- డీఎస్పీ కొండయ్యనాయుడు


హత్యకేసు నిందితులను అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె : జిల్లాలో సంచలనం సృష్టించిన కురబలకోట యువకుడి హత్య పరువుకోసమే జరిగిందని, హతుడు ఖాదర్‌బాషాకు పొలం లీజుకు ఇవ్వకుండా నిరాకరించడంతో, అతడు నిందితుల భార్యలను అత్యంత నీచంగా పదిమందిలో దూషించడంతో అవమానంగా భావించి ప్రతీకారంతో పథకం ప్రకారమే నిందితులు ఖాదర్‌బాషాను హత్యచేశారని డీఎస్పీ కొండయ్యనాయుడు తెలిపారు. రాజంపేటకు చెందిన నూర్‌బాషా సులేమాన్(44) కురబలకోటలోని బంధువుల అమ్మాయిని వివాహం చేసుకుని స్థానికంగా గెద్దవారివీధిలో స్థిరపడ్డాడు. కువైట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడి తోడల్లుడైన కల్లూరి అబ్దుల్‌రహీం(26) సులేమాన్‌తో పాటు కువైట్‌లో ఉంటున్నాడు. స్థానికంగా సులేమాన్‌కు ఆరు ఎకరాల పొలం ఉంది. పొలాన్ని స్థానిక చింతపండు వ్యాపారి బాబాఫకృద్దీన్ కుమారుడు వేంపల్లె ఖాదర్‌బాషాకు లీజుకు ఇచ్చి, పొలం చూసుకున్నందుకు ప్రతినెలా రూ.15వేలు చెల్లించేవాడు. సులేమాన్ భార్య పొలం చూసుకుంటుండేది. ఈక్రమంలో సులేమాన్ భార్యతో ఖాదర్‌బాషాకు అక్రమసంబంధం ఉందంటూ స్థానికంగా పుకార్లు వచ్చాయి. ఈ విషయం తోడల్లుడు అబ్దుల్‌రహీం ద్వారా తెలుసుకున్న సులేమాన్ 15రోజుల క్రితం కువైట్ నుంచి ఖాదర్ బాషాతో పొలంలీజు ఒప్పందాన్ని రద్దు చేసుకున్నాడు. దీన్ని జీర్ణించుకోలేని ఖాదర్‌బాషా, అంగళ్లు బస్టాండ్‌లో అబ్దుల్‌రహీం, అతడి స్నేహితుడైన టేకులపాళ్యం అరుణ్‌కుమార్(25)లతో గొడవపడ్డాడు. ఇంట్లోని ఆడవారిని అసభ్యంగా మాట్లాడటంతో దీన్ని అవమానంగా భావించిన అబ్దుల్‌రహీం , జరిగిన విషయాన్ని సులేమాన్‌కు చెప్పాడు. ఖాదర్ బాషాను అంతమొందించేందుకు పథకం వేశారు. హత్యలో అరుణ్‌కుమార్ సాయం తీసుకున్నారు. ఈనెల 18 రాత్రి 7.45నిమిషాల సమయంలో ఖాదర్‌బాషా స్కూటర్‌లో ఎక్కించుకుని కురబలకోట డంపింగ్‌యార్డు వైపు వెళ్లారు. అక్కడ ముందుగానే వెంటతెచ్చుకున్న కత్తితో గొంతులో పొడిచి చంపారు. కేసు దర్యాప్తు చేసిన సీఐ రమేష్, ఎస్ఐ దిలీప్‌కుమార్‌లు నిందితుల ఆచూకీ కనుగొన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు కురబలకోట మండలం యరబల్లి పంచాయతీ, బాపనపల్లె వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశామన్నారు.

నష్టపరిహారం కోసం ముదివేడు నిర్వాసితుల ధర్నా


రైతులతో కలిసి ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

మదనపల్లె : ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం మదనపల్లి సబ్ కలెక్టరేట్ ఎదుట ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులతో కలసి ధర్నా నిర్వహించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించి, పునరావాసం కల్పించాలని, ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటు నిర్మాణం కోసం 25 లక్షల రూపాయలు ఇవ్వాలని, బకాయి ఉన్న లీజు చెల్లించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు మాట్లాడుతూ కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లి గ్రామంలోని పిచ్చలవారిపల్లి, సీతివారిపల్లి, కొత్తపల్లి, బి. కొత్తకోట మండలం కోటావూరు గ్రామం చౌటకుంటపల్లి, దిన్నెమీదపల్లె తదితర గ్రామాల్లో నివాసం ఉన్న 300 మంది రైతులు 780 ఎకరాల భూమిని ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కోసం కోల్పోతున్నారన్నారు. భూములు, ఇళ్లు కోల్పోయిన రైతులకు, వెంటనే 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూమికి భూమి ఇచ్చి పరిహారం ఇవ్వాలని, పునర్నిర్మాణం, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు హరిశర్మ, ప్రభాకర్ రెడ్డి, శంకర్ రెడ్డి, శ్రీనివాసులు, సురేంద్రరెడ్డి, సురేష్, తిరుమలరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, అమరావతి, ప్రభావతి పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థపై సర్పంచ్‌లకు అధికారం ఇవ్వాలి

జిల్లా కలెక్టర్‌కు గ్రామపంచాయతీ సర్పంచ్‌ల వినతి


జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

రాయచోటి అర్బన్ : గ్రామ సచివాలయ వ్యవస్థపై పంచాయతీ సర్పంచ్‌లకు పూర్తిస్థాయి అధికారం ఇవ్వాలని సర్పంచ్‌ల సంఘం నేతలు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు సోమవారం కోరారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను కలుసుకుని గ్రామ పంచాయతీల సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిందన్నారు. అయితే సచివాలయ వ్యవస్థపై ఉన్నతాధికారుల సరైన పర్యవేక్షణ లేక ఉద్యోగుల పనితీరు అధ్వానంగా తయారైందన్నారు. ప్రభుత్వం గత మూడేళ్లుగా పంచాయతీల అభివృద్ధికి నిధులు విడుదల చేయడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌లకు నెలకు రూ.10 వేల పారితోషికంతో పాటు మాజీ సర్పంచ్‌లకు జీవిత కాలం పెన్షన్లను అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పూలుకుంట పార్థ సారధిరెడ్డి, ఉమ్మడి కడప జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎం.లక్ష్మీనారాయణ, పల్లపు వాసుదేవ, సోమారపు నాగార్జునాచారి, తుమ్మల చంద్రమ్మ, మల్‌రెడ్డి, కేశవయ్య, వెంకటరమణ,,రెడ్డెయ్య, మాజీ జడ్పీటిసి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.